54

# సత్పురుషుల సాంగత్యం

ఒకసారి త్రిలోక సంచారి అయిన నారదుడు బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్లాడు.

"నారదా! ఏమి విశేషాలు?" అని బ్రహ్మదేవుడు అడిగాడు.

"పిత్రుదేవా! సకల జీవుల జీవిత నిర్దేశకా! భూలోకంలోని ప్రజలలో చెడు పెరిగిపోతోంది. జనం వక్రమార్గాలను అవలంబిస్తున్నారు. మరి వీరిని సన్మార్గంలో వుంచే తరుణోపాయం లేదా?" అని అడిగాడు. నారదుడు.

"లేకేం... వుంది. చందన వృక్షాలకు సమీపంలోవున్న విషపు మొక్కలకు కూడా మంచి గంధపు తావి అబ్బినట్లు- సత్పురుషుల సాంగత్యంవల్ల ఎటువంటివారైనా సన్మార్గులు కాగలరు. ఉత్తమ జన్మలు పొందగలరు" అని అన్నాడు విధాత.

"సత్పురుషుల సాంగత్యం అందరికీ సాధ్యమవుతుందా?" అని సందేహం వెలిబుచ్చాడు నారదుడు.

"సత్పురుషుల సాంగత్యం మూడు విధాలుగా వుంటుంది. అవి దర్శనం, శ్రవణం, భాషణం... అనేవి. అంటే – సజ్జనులను దర్శించడం, వారి మాటలను వినడం, వారితో మాట్లాడటం అన్నమాట! సమయం వచ్చినప్పుడు వాటిని గురించి నీకే అనుభవంలో తెలుస్తుంది" అన్నాడు చతుర్ముఖుడు. బ్రహ్మదేవుని వద్ద సెలవు తీసుకుని తిరిగి భూలోక సంచారానికి బయలుదేరాడు నారదుడు.

గ్రీష్మ తాపం చాలా అధికంగా వుంది . నారదుడు ఒక చెట్టు నీడలో విశ్రాంతి తీసుకోసాగాడు.

చెట్టుపైన వున్న ఒక పక్షి అప్పుడే గ్రుడ్లను పెట్టింది. వడగాడుపుకి తట్టుకోలేక దాని ప్రాణం పోబోతోంది. అది నారదుని వంక దీనంగా చూసింది.



నారదుడు దాని వంక జాలిగా చూశాడు. వెంటనే ఆ పక్షి క్రిందపడి చనిపోయింది.

తాను చూడగానే పక్షి చనిపోవడం నారదునికి బాధ కలిగించింది.

కొద్దిరోజులు గడిచిపోయాయి. నారదుడు ఒక గ్రామం నుంచి వెళ్తున్నాడు. అలా వెళ్తుండగా ఒక పండితుడు కనిపించాడు.

మునిని చూడగానే ఆ పండితుడు- "స్వామీ... లోనికి దయచేయండి!" అని ఆహ్వానించాడు.

నారదుడు లోనికి వెళ్లాడు.

ఆ సమయంలో పండితుని కొట్టంలోని ఆవు దూడను వేయబోతోంది. అయితే... ఆ దూడ సరిగ్గా బయటకు రాలేకపోవడంతో ఆవు చాలా బాధపడ్తోంది. ఆందోళనతో ఆ ఆవు దగ్గరే వున్నాడు పండితుడు.

అక్కడ నుంచే నారదునితో మాట్లాడసాగాడు-

"స్వామీ.. ఈ ఐహిక జీవితంతో విసిగి పోయాను. నాకు తరుణోపాయం చూపించి మోక్షం అనుగ్రహించండి" అని అడిగాడు ఆయన.

"పరోపకారాన్ని మించిన పరమార్థం లేదు. అపకారికి కూడా ఉపకారం చేయగలిగినపుడు ప్రజలందరూ సన్మార్గులవుతారు. ఈ భూలోకం అపర స్వర్గం అవుతుంది" అన్నాడు నారదుడు.

ఆ మాటలు వింటున్న ఆవుకి బాధతోనో, భక్తితోనో కళ్ళంబట నీళ్ళు కారాయి.

"అంబా...!" అని బిగ్గరగా అరిచి దూడను వేసింది.

నారదుడు ఆ ఆవు వంక చూశాడు. మరుక్షణంలో ఆవు ప్రాణం పోయింది. తాను చూడగానే ఆ ఆవు చనిపోయినందుకు నారదునికి చాలా బాధవేసింది.

మరి కొంతకాలం గడిచింది. నారదుడు కాశీరాజ్యం చేరాడు.

నగరమంతా ఉత్సవాలతో, ఆనంద సందోహంలో ఓలలాడుతోంది. అందుకు కారణం... కాశీరాజుకు పుత్రోదయం కావడం!

నారదుడు నగరంలో ఉన్నాడన్న విషయం కాశీరాజుకి తెలిసింది. ఆయనను సాదరంగా రాజమందిరానికి కొని తెమ్మని తన మంత్రిని, పరివారాన్ని పంపాడు.

మహర్షి కోటలోకి రాగానే నమస్కరిస్తూ ఎదురేగి లోనికి తీసుకువచ్చాడు.

"స్వామీ... తమ అనుగ్రహంవల్ల మా పూజలు ఫలించి చిరకాలానికి మాకు పుత్రోదయం అయింది. మహర్షులు వచ్చి శిశువును ఆశీర్వదించవలసిందిగా ప్రార్థన!" అన్నాడు మహారాజు వినయంగా.

నారదుడు తటపటాయించాడు. ఆయనకు భయం వేసింది. 'తాను చూడగానే పక్షి చనిపోయింది.., తన చూపు పడగానే ఆవు ప్రాణాలు విడిచింది. ఇప్పుడు ఈ శిశువుని చూస్తే ఏమి అరిష్టం సంభవిస్తుందో...' నన్న దిగులు పట్టుకుంది.

మహారాజు మాటను కాదనలేక అయిష్టంగానే అంతఃపురం లోనికి వెళ్లాడు. శిశువు తల నిమురుతూ "చిరంజీవ... చిరంజీవ" అని ఆశీర్వదించాడు.

ఆ బాలుడు నారదుని చూస్తూ "ఉంగా... ఉంగా..." అంటూ కేరింతలు కొట్టాడు.

అతనికి ఏమీ జరగనందుకు నారదుడు ఎంతో సంతోషించాడు. తన ప్రశ్నకి సమాధానం దొరక్కపోగా, 'తన దృష్టి పడి రెండు ప్రాణాలు పోయాయి... ఇలా ఎందుకు జరిగిందో' తెలుసుకోవాలనుకుని బ్రహ్మలోకానికి వెళ్లాడు.

జరిగినదంతా బ్రహ్మదేవునికి నివేదించాడు. "పితృదేవా! నా సందేహం నివృత్తి చేయండి" అని ప్రార్థించాడు.

బ్రహ్మదేవుడు చెప్పసాగాడు-

"సత్పురుషుల దర్శనం, శ్రవణం, భాషణం వల్ల ఉత్తమ ఫలితాలు కలుగుతాయని చెప్పాను కదా! ఆ పక్షిని నీవు చూడడం వల్ల అది చనిపోలేదు. దానికి కాలం తీరి చనిపోయింది. అయితే... అదే సమయానికి నీవు వెళ్లావు. యాధృచ్ఛికంగా దానికి మరణం సంభవించింది. అయితే... నీ వంటి సత్పురుషుని దర్శనం అయినందువల్ల మరుజన్మలో అందరూ ఆరాధించే గోమాతగా జన్మించింది.

ఆ గోమాత కూడా కాలం తీరిన సమయంలో నీవు వెళ్లావు. నీవు పండితునికి మోక్షమార్గం ఉపదేశిస్తుండగా అది వింది. సులువుగా దూడను వేసింది.

నీవంటి సత్పురుషుని పలుకు అది శ్రవణం చేసింది. కనుక అది కాశీరాజ్యంలో మహారాజు కుమారునిగా జన్మించింది.

నీవంటి సత్పురుషునితో అది "ఉంగా...ఉంగా..!" అంటూ సంభాషించింది కనుక, ఆ బాలుడు చక్రవర్తి కాబోతున్నాడు. మరి- సత్పురుషుల సాంగత్యం ఎంత గొప్పదో అర్థమయిందా?" అని చిరునవ్వుతో నారదునికి బ్రహ్మదేవుడు సందేహ నివృత్తి చేశాడు.

★★★